

# బల్లకట్టు బాపులు


**లక్ష్మీరమణ**

ఆ నాడు పెద్ద పెట్టున గాలి వాన మొదలైంది. కృష్ణా కెనాల్ అవతలగట్టు కింద ఉన్న మా పెద్ద తోటలో చెట్లన్నీ ఆ గాలికి ఉగ్రంగా ఊగిపోతున్నాయి. పెద్ద పెద్ద చెట్ల కొమ్మలు, ఫెళ్ళున విరిగి పడుతున్నాయి. తోటంతా బీభత్సంగా ఉంది.

అంత గాలి దుమారంలో స్కూలుకు వెళతామని చెబితే అమ్మ ఏ మాత్రం ఒప్పుకోదని మాకు బాగా తెలుసు. అందుకే గప్‌చిప్‌గా రెయిన్‌కోట్లు తీసుకుని బడికి బయలుదేరాము. ఎందుకో ఆ గాలి వానలో స్కూలుకు వెళ్ళితీరాలని ఎప్పుడూ లేని సరదాగా ఉంది.

స్కూలుకు వెళ్ళాలంటే కెనాల్ ఇవతలి వైపు ఉండటం వల్ల బల్లకట్టు ఎక్కి, కెనాల్ దాటి మరీ అవతలి గట్టు చేరుకోవాలి. గాలి వానలో బల్లకట్టు ఎగిరెగిరి పడుతుంటే ఆ కొంచెం సేపూ దానిమీద ప్రయాణం చెయ్యటం అన్న థ్రిల్ ఊహించుకుంటూ బయలుదేరాము. ఆ బురదకు జారి పడకుండా బొటనవేళ్ళు బురదలో గుచ్చి పెట్టి జాగ్రత్తగా నడవసాగాము. ఎంత జాగ్రత్తగా నడిచినా చిన్న జర్రున జారి పడనే పడ్డాడు. వాడిని పండూ, నేనూ కలిసి లేపాము. రెయిన్‌కోటంతా బురదైపోయింది. అయినా చిన్నా ఇంటికి వెళ్లటానికి ఒప్పుకోలేదు. చిన్నా ఇంటికి అంత త్వరగా తిరిగి వెళ్ళితే మేము బల్లకట్టు ఎక్కకముందే పాలేరుని పంపించి ఇంటికి పిలిపించే ప్రమాదంకూడా ఉంది. ఎలాగో గట్టు దిగి బల్లకట్టు చేరుకున్నాము.

బల్లకట్టు బాపులు అవతలి వైపున బల్లకట్టు ఆపుకుని ఉన్నావాడు మమ్మల్ని చూసి ఇవతలి గట్టుకు వచ్చాడు. నోట్లో చుట్ట తీసి, "అదేంది బాబులూ— ఇంత ఆనలో బడికి పోపోతేనేం? నడవండి బాబూ, ఇంటికి పొండి" అని పెద్ద సలహా ఇవ్వవచ్చాడు. బాపులు మీద మాకు భలే కోపం వచ్చేసింది. వాహ్ తిప్పలూ పడి మేము ఇంట్లో చెప్పకుండా బయటపడితే ఈ బాపులు ఒకడు మా ప్రాణానికి. "మేస్టారు కోప్పడతారుగా బాపులూ. మేము తప్పకుండా ఈ వేళ స్కూలుకు వెళ్ళాలి" అంటూ బల్లకట్టు ఎక్కేశాము.



[illegible]
ఫోటో—ఎస్. ఆర్. మూర్తి (హైదరాబాదు)

"బల్లకట్టు ఒడ్డుకు [illegible] సేండి, బాబులూ. ఈ ఆసాగాలికి కుదుపుడుగా ఉంది. ఆసిక పెద్దబాబు కేకలు వేస్తారు" అంటూ బాపులు చుట్ట నోట్లో పెట్టుకుని, తెడ్డు చేత పట్టాడు

నీళ్లు బురదలుగా ఉన్నాయి, తెడ్డు వేసినప్పుడంతా ఎత్తుగా లేచి పడుతున్నాయి. గాలికి బల్లకట్టు అటూ ఇటూ ఊగిపోతూంది.

వాన పడుతూనే ఉంది. ఆకాశంలో మబ్బులు నల్లగా బొబ్బలు పెడుతున్నాయి. చిన్నా బల్లకట్టు అంచుకు ఆనుకునే నిలుచున్నాడు అంతదాకా, రెయిన్‌కోట్‌కి అంటిన బురదకు జర్రున జారి ఎలా పడ్డాడో నీళ్లలోకి అలాగే జారి పడిపోయాడు. పండు కెవ్వున కేక వేశాడో లేదో బాపులు గబుక్కున నీళ్లలోకి దూకేశాడు. అప్పుడే ఒక్కసారి నీళ్లలోకి మునిగి తేలిన చిన్నాని ఎత్తుకుని అటూ ఇటూ తిరిగిపోతున్న బల్లకట్టు ఎక్కేశాడు. చిన్నాని పడుకోబెట్టి వెంటనే తెడ్డు అందుకున్నాడు.

నేను, పండు ఒక్కమొహాలు వేసుకుని బాపులు వంక చూశాము. మా కప్పుడు బాపులు టార్జాన్ కన్నా గొప్ప వీరుడుగా కనిపించాడు. చిన్నాని మునిగిపోకుండా ఒక్క క్షణంలో పట్టుకు రావటం, వెంటనే బల్లకట్టు కొట్టుకుపోకుండా కంట్రోలు చెయ్యటం మాటలేనా! తలపై కండువా తీసి మా దగ్గర పారేస్తూ, "బాబులూ, చిన్నా బాబుని తుడిచి, కప్పండి. సీరాముడి దయవల్ల గండం గడిచింది. నాకు మాట దక్కింది లేకపోతే నాకే చేళ ఎంత మాట వచ్చేది బాబులూ!" అన్నాడు.

బాపులు పైకండువా చుట్ట వాసన కొడుతూంది. చిన్నా గడగడ వణికి పోతున్నాడు భయంతో కళ్లు తేల వేస్తున్నాడు. పండు, నేను చిన్నాని తుడిచి, ఆ బాపులు కండువాతో కప్పాము. బాపులు బల్లకట్టు తిప్పుకుని ఇంటి వైపు గట్టు చేర్చాడు. బల్లకట్టును గుంజకు కట్టేసి చిన్నాని ఎత్తుకుని, "బాబులూ, నేను చెబుతూనే ఉన్నా, పిల్లలకి ఇంత మొండిధైర్యం పనికిరాదు. నడవండి ఇంటికి. చిన్నా బాబుని నే నెత్తుకొస్తా పదండి" అన్నాడు. పండూ, నేనూ నేరస్థుల్లా ఒకరి వంక ఒకరం చూసుకున్నాము. చేసిన నేరం మనసులో ఒప్పుకున్నాము.

గట్టు ఎక్కేసరికి అప్పటికే పాలేరు పరుగెత్తుకు వస్తున్నాడు. చిన్నాని చూసి గాభరాగా "ఏమైంది బాబూ ?" అని అడిగాడు.

బల్లకట్టు బాపులు మాత్రం ధైర్యంగా— "ఏమీ కాలేదులే. ఇద్దరు బాబుల్నీ చెరో బుజానా వేసుకో, తొందరగా నాలుగడుగుల్లో ఇల్లు చేరుకుందాము. ఈ రొంపిలో బాబులు నడవలేరు" అన్నాడు. దానితో మేమిద్దరం ఎంత వద్దన్నా పాలేరు మా ఇద్దర్నీ బుజాన వేసుకున్నాడు.

మునిగి తేలిన చిన్నాని ఎవ్వరూ ఏమనలేదు కానీ పండునీ, నన్నూ మొహాలు వాచేలా చీవాట్లు పెట్టారు ఆ రోజు ఇంట్లో. మే మిద్దరం కిక్కురు మనకుండా అన్నీ విని ఊరుకున్నాం.

మా అడ్వెంచర్ మరీ ఇంత అన్యాయంగా ముగిసినందుకు లోలోపల చాలా చింతించాము. రెండ్రోజులు వాన వెలిసినా మమ్మల్ని స్కూలుకు పంపించలేదు.

మర్నాడో రోజుకూడా చిన్నా ఇంట్లో ఉండిపోయాడు. నీళ్లలో పడ్డ భయం నుండే ఇంకా పూర్తిగా కోలుకో లేదు వాడు. పండూ, నేనూ గాలివాన నాటి కబుర్లే చెప్పుకుంటూ బల్లకట్టు చేరుకున్నాము. బల్లకట్టు బాపులికి ఎన్నో థాంక్సు చెప్పాలని పించింది. థాంక్సు అని చెపితే అర్థం కాదుగా? బాగుండదుకూడా. ఎలా చెప్పాలో అని ఆలోచిస్తూ బాపులు వంక చూశాము. ఇద్దరం ఆశ్చర్యపోయాము.

బల్లకట్టు మీద బాపులు లేడు. బాపులు బదులు ఎవరో కొత్తవాడు కనిపించాడు. మేమూ స్కూలుకు వెళుతున్నప్పటినుంచీ బాపులే బల్లకట్టు తోస్తున్నాడుగా? మరి ఈ రోజు కొత్తవాడెందుకు వచ్చినట్టు? మా కిద్దరికీ అర్థం కాలేదు. పండే అడిగాడు ఆ కొత్త అబ్బాయిని: "బాపులు రాలే దేం?"

ఆ కొత్త అబ్బాయి మాట్లాడకుండా కళ్లవెంట నీళ్లు పెట్టుకున్నాడు. పండుకి, నాకు పెద్ద భయం పట్టుకుంది. నేను నోరు జారి గబుక్కున అన్నాను: "బాపులు చచ్చిపొయ్యాడా?" కొత్త అబ్బాయి తల అడ్డంగా తిప్పి, "బాపులు బతికే ఉన్నాడు" అన్నాడు.

ఆ మాట వినగానే— 'అమ్మయ్య, బ్రతికాంరా బాబూ. బాపులు చచ్చిపోలేదు. బతికే ఉన్నాడు. అంతేచాలు' అనుకున్నాము. "మరెందుకు మవ్వు ఏడుస్తున్నావు?" అన్నాడు పండు.

"అంతకన్నా అన్యాయం జరిగింది, బాబులూ. బాపులు మా బావేగా? మా అక్క మొగుడు. మా అక్క పురిట్లోనే పిల్లాణ్ణి కని చచ్చిపోయిందిగా? మా బావ గుడిసెగట్టు కాడనేగా ఉంది. గాలి ఆనకి అంతా గుడిసెలు కప్పుకుంటుండారు. పిల్లగాడు గట్టు ఒడ్డుకి ఎట్ట వచ్చాడో వచ్చాడు గావాలు, అమెరికను ఆసుపత్రి దగ్గర మెట్లమీదుగా జారి నీళ్లలో పడి పొయ్యాడు".

"బాపులు బల్లకట్టు మీద నుండి దూకి పైకి తియ్యలేదా?" ఆత్రంగా నేను అడిగాను.

"అదే గాచారం, బాబులూ. బల్లకట్టు ఆ పక్క కట్టేసి అవతల గట్టుకు పొయ్యినాడంట— ఒక పిల్లోడి నెత్తుకుని."

పండూ, నేనూ ఒకరి నొకరం చూసుకున్నాం. ఇద్దరికీ తెలిసింది, బాపులు చిన్నాని ఎత్తుకుని మా ఇంటికి తెచ్చినప్పుడు ఆ ప్రమాదం జరిగిందని. మా ఇద్దరికీ ఏడుపు వచ్చింది. బాపులు చిన్నాని నీళ్లలో నుండి తీసి, "సీరాముడి దయవల్ల గండం గడిచింది" అన్న మాటలు గుర్తుకు వచ్చినాయి. మరి ఆ శ్రీరాముడు బాపులు కొడుకుని ఎందుకు గండం నుండి తప్పించకూడదు? బాపులు కొడుకు ఎందుకు చచ్చిపోవాలి? దేవుడికి బాపులు కొడుకంటే అంత ఇష్టమా? లేకపోతే ఎందుకు చచ్చిపోయాడు? ★